క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కమలాపూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ సూచించారు. కమలాపూర్ పరిధిలోని కాసీంపల్లి వాసులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అపరిచితులకు ఓటీపీ నంబర్లు చెప్పవద్దని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాల్య వివాహాలు చేసి పిల్లల బంగారు భవిష్యత్ నాశనం చేయవద్దన్నారు. చిన్నారులను పాఠశాలలకు పంపించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాసీంపల్లి వాసులు పాల్గొన్నారు.

నియామకం



శాయంపేట: మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుర్రం అశోక్‌ను ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఎన్నికకు సహకరించిన ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


తిరుపతి (ఫైల్)

శాయంపేట: కూలిపని చేసుకొని జీవించే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద తిరుపతి(39) గ్రామంలో ఉపాధి లేక పని నిమిత్తం హనుకొండలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి కొన్నిరోజుల నుంచి అస్వస్థతగా ఉండడం, ఎముకలలో నీరు రావడంతో హాస్పిటల్‌లో చూపించిన కూడా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం కూలి పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్వగ్రామం పెద్దకోడెపాక గ్రామానికి చేరుకుని పురుగుల మందు తాగాడు. నోటినుంచి నురుగులు కక్కుతుండగా ఇంటి పక్కనవారు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తిరుపతి భార్య మంద స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

నేడు ప్రమాణస్వీకారం

పరకాల: పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం నేడు(బుధవారం) చేయనున్నట్లు మార్కెట్ అధికారులు మంగళవారం తెలిపారు. కొత్త చైర్మన్‌గా నియామకమైన నిప్పాని హైమావతితో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్లు చేసే ప్రమాణస్వీకారంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితోపాటు జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, భూపాలపల్లి ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

పాటలు, పద్యాల పోటీల్లో తృతీయ స్థానం



శాయంపేట : జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వేప్ జిల్లా స్థాయి పాటలు, పద్యాల పోటీల్లో శాయంపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిప్రియ తృతీయ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మంగళవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా గెలిచిన సాయిప్రియ మెమోంటో, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. సాయిప్రియను ఇన్‌చార్జ్ టీచర్ కరుణ, మండల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు, ఎంఈఓ రమాదేవి, హెచ్‌ఎం శ్రీలత అభినందించారు.


ఎల్కతుర్తిలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం


కమలాపూర్: పూజలు చేస్తున్న భక్తులు


ఆత్మకూరులో..


కటాక్షపూర్‌లో..

ఆదిదేవుడికి పూజలు

- వాడవాడలా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ
- నవరాత్రులు పూజలందుకోనున్న బొజ్జగణపయ్య

ఎల్కతుర్తి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల వ్యాప్తంగా వాడవాడల బొజ్జ గణపయ్య సోమవారం కొలువుదీరాడు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో భక్తులు విగ్రహాలను వేద మంత్రోచ్చరణముల నడుమ ప్రతిష్ఠించారు. ఏకదంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి లంబోధరుడి ఆశీస్సులు పొందారు. నైవేద్యాలు,, ఉండ్రాళ్లు, భారీ లడ్డులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది ఆకట్టుకునే రంగులు, ఆకర్షించే రూపాల్లో ఉన్న వరసిద్ధి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు తమ ఇళ్లలో సైతం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. కాగా ఈ వేడుకల్లో ఎలాంటి అపశ్రుతులు, గొడవలు జరుగకుండా ఉండేందుకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ఇప్పటికే సూచించారు. పలు పండపాల వద్ద నిర్వాహకులు విద్యుత్ దీపాలను అలంకరించారు.

గ్రామాల్లో..

శాయంపేట : మండలంలోని గ్రామాల్లో సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వాడవాడలా వినాయక మండపాల నిర్వాహకులు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్స్ నడమ, మహిళల మంగళహారతులతో ఊరేగింపుగా తీసుకొని వచ్చి మండపాల వద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు. అత్యంత భక్తితో పూజలు చేశారు. శాయంపేటలో పర్యావరణ పరిరక్షణ కోసం బస్టాండ్ సెంటర్‌లో కుమ్మరి కులస్తులు రేగడి మట్టితో తయారు చేసిన మట్టి విగ్రహాలను, మత్స్యగిరి స్వామి దేవాలయంలో విశ్వబ్రాహ్మణులు మట్టి విగ్రహాలను తయారు చేసి విక్రయించారు.

ఆత్మకూరు: మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. భక్తులచే విశేష పూజలు అందుకుంటున్నారు. సోమవారం ఊరేగింపులతో గణేషుడి విగ్రహాలను మండపాల వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజు విశేషంగా పూజలు చేశారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలు ఆకృతుల్లో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఇళ్లల్లో కొలువుంచి పూలు, పత్రులతో పాటు వినాయకునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఉండ్రాళ్లను నైవేద్యంగా సమర్పించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నాలు తొలగించి శుభాలు ప్రసాదించాలని వేడుకున్నారు. విద్యాబుద్ధులు ప్రసాదించాలని విద్యార్థులు ఆదిదేవుడిని ప్రార్థించారు. నిర్వాహకులు భక్తి ప్రపత్తులతో భజనలు చేస్తూ వినాయక విగ్రహాలను గణపతి మండపాలకు తీసుకెళ్లి ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం సంకీర్తనలతో భజనలు చేశారు. దేవాలయాలతో పాటు వాడవాడలా నెలకొల్పిన వినాయక మండపాల్లో నవరాత్రుల పాటు గణనాథుడు ఘనమైన పూజలు అందుకోనున్నాడు.

దామెర: మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రుల సంబురాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి మండపాలను అందంగా అలంకరించడంతో పాటు విద్యుత్ దీపాలతో కళకళలాడే విధంగా తీర్చిదిద్దారు. సంప్రదాయరీతిన భక్తి శ్రద్ధలతో గణనాథులకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గణనాథునికి ప్రీతిప్రాయమైన ఉండ్రాళ్లు, పిండివంటలు తయారుచేసి నైవేద్యంగా సమర్పించారు. మండల కేంద్రంలోని ఆదర్శయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథునివద్ద మండల రైతు బంధుకోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి దంపతులు, బస్‌స్టాండ్ వద్ద స్వర్పంచ్ గురిజాల శ్రీరాం రెడ్డి దంపతులు, రేంబోయూత్ ఆధ్వర్యంలో సుగుణాకర్‌రావుపావని దంపతులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఊరుగొండలో గోగుల సత్యనారాయణ రెడ్డి దంపతులు, కోగిల్వాయిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి దంపతులు, ఒగ్లాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరకాల: పట్టణంలోపి దేవాలయాలతో పాటు ప్రతి కాలనీలో సంఘాలు, యువజన సంఘాలు నెలకొల్పిన మండపాలకు సోమవారం సాయంత్రం వరకు ఊరేగింపులు, బ్యాండు చప్పుల్లతో గణనాథులు చేరుకున్నారు. ప్రత్యేక పూజలతో మండపాలు భక్తుల సందడి నెలకొంది. పరకాల కుంకుమేశ్వర స్వామిదేవస్థానంలో ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు 35 కిలోల భారీ లడ్డు ప్రసాదం ఏర్పాటు చేశా రు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఎక్కడ లేని విధంగా స్వామి వారికి లడ్డుప్రసాదం ఏర్పాటు చేశామని, నిమజ్జనం రోజు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు పంపిణీ చేస్తామని చైర్మన్ తెలిపారు.


పరకాల: లడ్డూ ప్రసాదం


శాయంపేటలో..


దామెరలో..


పరకాల: ద్విముఖ గణపతి


పరకాల పట్టణంలో..

బహుజనులను సీఎం అభ్యర్థులుగా ప్రకటించాలి


దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న నాయకులు

కమలాపూర్: అన్ని రాజకీయ పార్టీలు ఆయా పార్టీల అధ్యక్షులుగా, సీఎం అభ్యర్థులుగా బహుజనులను ప్రకటించాలని ధర్మ సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేవలం 7 శాతం ఉన్న అగ్రవర్ణ రాజకీయ నాయకులు రాజకీయ వ్యవస్థను తమ ఆధీనంలో పెట్టుకుని 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం కమలాపూర్‌లో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దిష్టిబొమ్మలు దహనం చేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఆయా పార్టీల అధినాయకత్వాన్ని బీసీలకు కేటాయించాలని, ముఖ్యమంత్రి స్థానాన్ని దళితుడికి కేటాయించాలని, రాష్ట్ర కేబినెట్ అంతా అణగారిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 90 శాతం నిధులు అణగారిన కులాలకు కేటాయించాలన్నారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, బ్యూరోక్రసీ ఉన్నతాధికారులందరిని బీసీ, ఎస్సీ, ఎస్టీ అధికారులతో నింపాలని, ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల టికెట్లలో 93 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని కోరారు. మా పార్టీల్లో అగ్రకుల ఆధిపత్యం లేదని, సామాజిక న్యాయం పాటిస్తున్నామని బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌తోపాటు అధికారంలోకి వస్తామంటున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ డిమాండ్లను అమలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు నరేష్, నాయకులు గోల్కొండ రాజేష్, చిలువేరు రాకేష్, గట్టు మల్లు, అశోక్, రోహిత్, అజయ్, మణికంఠ, రమాకాంత్, నీవన్, హరీష్, విష్ణు, శ్రీరాం, ప్రశాంత్, స్నేహకుమార్, అరవింద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కమలాపూర్: ప్రస్తుత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో మంగళవారం కమలాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ ఉద్యమం సామాజిక న్యాయ సూత్రమని, ఎస్సీ వర్గీకరణకు అన్ని వర్గాలు మద్దతు ఇస్తున్నప్పటికీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టకపోవడం పాలకుల చేస్తున్న మోసమని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలువేరు సంపత్, జేరుపోతుల రమేష్, నద్దునూరి ప్రసాద్, నద్దునూరి కిరణ్, ఇసంపెల్లి స్వామి, అంకిల్ల రాజమల్లు, కుమ్మరి రమేష్, కిలుగూరి అనిల్, పోడేటి కాంతారావు, పెర్క శ్రీను, ఆకునూరి రాములు తదితరులు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ ఆమోదించకపోతే.. ద్రోహుల పార్టీగా బీజేపీ

పరకాల: ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని లేని పక్షంలో బీజేపీ ద్రోహుల పార్టీగా మిగిలిపోతుందని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బొచ్చు తిరుపతి మాదిగ అన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని కోరుతూ పరకాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరహారదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో బొజ్జ హేమంత్, నూతన్, కార్తీక్, జశ్వంత్, బాబు, సనత్, సాయి చందు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహుడికి అభిషేకం


అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లిలో స్వయంభూగా వెలిసిన స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని 12 పుష్కర నది, 3 సముద్ర జలాలతో విశేషంగా అభిషేకం చేశారు. మంగళవారం ఉదయం స్వామి, అమ్మవార్ల నిత్య కైంకర్యాలు పూర్తయిన తర్వాత ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పుష్కర పుణ్యనది జలాలతో పాటు పంచామృతాలతో అర్చకులు వేద మంత్రాలు పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మి-నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి- వేంకటేశ్వర స్వామిల ఉత్సవ మూర్తులకు కల్యాణం ఒకే వేదికపై జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు రవి ఆచార్యులు, వెంకటరత్నమాచార్యులు, జయ కృష్ణమాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ-రాణి, సుధీర్-మమత, సురేందర్, నరసింహస్వామి, గుండపు ఉమ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

యువతను నట్టేట ముంచిన 'చల్లా'

మామునూరు: పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై తిరుగుబాటు మొదలైందని, టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుతో జీవనోపాధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాయమాటలు చెప్పి నేడు యువతను నట్టేట ముంచారని బీజేపీ నేత డాక్టర్ కాళీప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బిక్షపతి ఆరోపించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో 17వ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలతో కలిసి వారు పర్యటించారు. కేంద్రం ప్రవేశ పెట్టిన పథకాలను ఇంటింటికి వెళ్లి వారు వివరించారు.

హైస్కూల్ హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ


కమలాపూర్: బాధ్యతలు స్వీకరిస్తున్న రాంకిషన్‌రాజు


ధర్మసాగర్(వేలేరు): హెచ్‌ఎంకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు


హెచ్‌ఎం మధును సన్మానిస్తున్న నాయకులు

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానోపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా కమలాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో నూతనంగా బదిలీపై వచ్చిన హెచ్‌ఎంలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమలాపూర్ మండలంలో అంబాల జెడ్పీహెచ్ఎస్‌కు రోజారమణి, శ్రీరాములపల్లికి జి.రమేష్‌బాబు, మాదన్నపేటకు కె.వెంకన్న, మర్రిపల్లిగూడెంకు కె.రాజేశ్వర్, భీంపల్లికి జె.రవి, ఉప్పల్ (బాలుర)కు ఎం.నిర్మల, ఉప్పల్ (బాలికలు)కు వి.వాణి, కమలాపూర్ (బాలుర)కు ఎం.రాజమల్లయ్య, కమలాపూర్ (బాలికలు)కు ఇ.రాంకిషన్ రాజు, వంగపల్లికి డి.రవీందర్, గూడూరుకు ఎస్.సత్యనారాయణ, శనిగరానికి కె.శ్రీధర్ బదిలీపై వచ్చారు. బదిలీపై వచ్చిన హెచ్‌ఎంలకు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో పటేల్ శ్రీనివాస్‌రెడ్డి (పీఆర్టీయూ), టి.శ్రీనాథ్, పీడబ్ల్యూసీ పవన్‌కుమార్ (డీటీఎఫ్), టి.శ్రీనివాస్ (టీఎస్‌యూటీఎఫ్), ఉపాధ్యాయులు ఎం.శివప్రసాద్, జి.ప్రసాద్, నవీన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఎండీ.హుసేనన్, ఓఎస్ ఎం.సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ హెచ్‌ఎంలకు స్వాగతం

ధర్మసాగర్(వేలేరు): గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా బదిలీ ప్రక్రియలో భాగంగా మండలంలోని 5 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు బదిలీపై వచ్చిన హెచ్‌ఎంలకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. వేలేరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు గౌరిశెట్టి రాజన్న, ఎర్రబెల్లి పాఠశాలకు మొగిలిచర్ల చంద్రమౌళి, మల్లికుదుర్ల పాఠశాలకు కె.జయసాగర్, పీచర పాఠశాలకు ఎం.శ్రీదేవి, కన్నారం పాఠశాలకు టి.విజయసాగర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వేలేరు పాఠశాలకు బదిలీపై వచ్చిన గౌరిశెట్టి రాజన్న అదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసి అక్కడికే హెచ్‌ఎంగా రావడంపై గ్రామ ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వి శ్రీనివాస్, గడ్డి శ్రీనివాస్,శ్రీను విద్యానంద్, మొగిలిచర్ల శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సన్మానం


పరకాల: నూతనంగా బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులను ఎస్టీయూటీఎస్ నాయకులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ సురేందర్, మధు, సి.హెచ్ రమాదేవిలను సన్మానించిన అనంతరం ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామగోని రాంబాబు మాట్లాడారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలకు దీటుగా తయారుచేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నామన్ సాంబయ్య, రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ సూర రమేష్, పరకాల మండల అధ్యక్షుడు యార వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు చారిత్రాత్మకం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పరకాల: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం చారిత్రాత్మకం అని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినందుకు మంగళవారం సాయంత్రం పరకాల బస్టాండ్ కూడలిలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, మహిళా మోర్చా నాయకురాలు ఆర్‌పీ సంగీత, గాజుల నిరంజన్, విజయ్‌కుమార్, పురుషోత్తం, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీకి పాలాభిషేకం


కవిత ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పరకాల: ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ వేదికగా అనేక ఉద్యమాలతో మహిళా రిజర్వేషన బిల్లుపై కేంద్రం కళ్లు తెరిచేలా చేశారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను అన్నారు. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినందున బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరకాల బస్టాండ్ కూడలిలో ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్స్ పసుల లావణ్య, శనిగరపు రజనీ, మార్క ఉమాదేవితో పాటు నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన పరికరాల భూమయ్య, శాయంపేటకు చెందిన రేణికుంట్ల ఉప్పలమ్మ, బగ్గి నరేందర్, మైలారం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ అరికిల్ల శ్రీధర్‌లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు చిందం రవి, మారెపల్లి కట్టయ్య, మారెపల్లి రాజేందర్‌లు ఉన్నారు. ఇదిలా ఉండగా.. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు పరికరాల భూమయ్య, మాస్కుల సారయ్య, గుండాల సాంబయ్య, కాట్రపల్లికి చెందిన బలిజె సాంబయ్య, పత్తిపాక గ్రామానికి చెందిన పులుమాటి భాగ్యలక్ష్మి, శాయంపేటకు చెందిన రేణిగుంట్ల ఉప్పలమ్మ, బగ్గి నరేందర్‌లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సోమవారం తెలంగాణ రాష్ట్ర యువజన నాయకులు సిరికొండ ప్రశాంత్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట శాయంపేట మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణ రెడ్డి, నాయకులు కటకం రాజ్‌కుమార్, జనగాని సత్యనారాయణ, మారెపల్లి సుమన్, బేర్ల రాకేష్, ఎస్కె గౌస్, మంద రాజన్న, రేకుల సమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి పునాది

ఆత్మకూరు: కార్యకర్తలే పార్టీకి పునాది అని కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నాగయ్యపల్లెకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. వీరికి విజయచందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైందని రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, ఇర్సడ్ల సదానందం, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, బయ్య పైడి, సముద్రాల రవి పాల్గొన్నారు.